క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవాబుపేట: మండల పరిధిలోని కారుకొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పీఏసీఎస్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో రైతులు గిట్టుబాటు ధర కల్పించి, విక్రయ సమయంలో ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అధికారులు హన్మంతు, డైరెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబుపేట: మండల పరిధిలోని తీగలపల్లి, కారుకొండ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యల పునరుద్ధరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశువులకు టీకాలు వేయించాలి

మిడ్జిల్: మండల పరిధిలోని వాడ్యాల్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు శుక్రవారం వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించినట్లు పశు వైద్యాధికారి శివరాజ్ తెలిపారు. మండలంలోని రైతులు తమ పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాక్సిన్ తీసుకోవడం వలన కలిగే లాభాలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యోగాసన టోర్నీలో ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో శుక్రవారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి యోగాసన టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. వరుణ్‌తేజ్ ప్రథమ, సీహెచ్.అఖిల్ ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి తెలిపారు. టోర్నీలో జిల్లా రెండో ఓవరాల్ చాంపియన్‌షిప్ పొందినట్లు పేర్కొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చన, సహస్ర లలితా పారాయణం చేశారు. అనంతరం వాసవీమాతకు పల్లకి సేవ చేశారు. దాతలు భక్తులకు ప్రసాదం, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కలర్ ప్రింటర్ బహూకరణ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిరానికి రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు డా.సుజీత్‌కుమార్ శుక్రవారం కలర్ ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తున్న సరస్వతి శిశుమందిరాలు అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, నోముల కృష్ణయ్య, ముచ్చర్ల శ్రీకాంత్, జవహర్ పాల్గొన్నారు.

18 వీల్ చైర్లు, 40 కుర్చీల వితరణ

పాలమూరు: జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాల మేరకు సంక్షేమ శాఖల నుంచి జిల్లా జనరల్ ఆస్పత్రికి 18 వీల్ చైర్లు వితరణ చేశారు. దీంతో పాటు జీఎంఆర్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధి మల్లారెడ్డి జనరల్ ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్‌కు ఒక ఆఫీసర్ చైర్, 40 సాధారణ కుర్చీలు వితరణ చేశారు. శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్‌కు అందజేశారు.

మృతదేహం వెలికితీత.. కేసు నమోదు

హన్వాడ: మండల పరిధిలోని టంకర గ్రామంలో గురువారం ఓ యువకుడు బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. బావిలో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని శుక్రవారం బావి నుంచి వెలికితీశారు. ఈ మేరకు మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మరికల్‌కు చెందిన శివారెడ్డి, సుమలత భార్యాభర్తలు పిల్లలు సహస్రా, మాన్విక్‌రెడ్డితో కలిసి శుక్రవారం మహబూబ్‌నగర్ నుంచి బైక్‌పై మరికల్ వెళ్తున్నారు. మండల పరిధిలో మణ్యంకొండ సమీపంలో పాలమూరు పట్టణానికి చెందిన రమేష్ వేగంగా వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో సహస్ర కాలు పూర్తిగా ఫ్రాక్చర్ కాగా మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు.

✦ బాబోయ్..డేంజర్





● ప్రమాదకరంగా కూలీల తరలింపు

44వ నంబర్ జాతీయ రహదారిపై ఎప్పుడు, ఎక్కడ ఏం ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. వాహనాల్లో కూలీల తరలింపు ప్రమాదకరంగా మారింది. మూసాపేట స్టేజీ వద్ద నిత్యం వాహనాల్లో కూలీలను కిక్కిరిసి కూర్చోబెట్టి ప్రమాదకరంగా తరలిస్తున్నారు. నిత్యం రహదారిపై ఏదో ఒక చోట ప్రయాణికులను తరలించకూడని వాహనాల్లో తరలిస్తూనే ఉన్నారు. - అడ్డాకుల

'మందకృష్ణ తన వైఖరి మార్చుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తన వైఖరి మార్చుకోవాలని జాతీయ మాల మహానాడు స్టేట్ కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఎక్కడ తన ఉపాధికి గండి పడుతుందోనని ఆందోళన చెందుతున్నట్లు మందకృష్ణ మాటల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కులగణనలో దళితుల జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలవుతున్న నేపథ్యంలో కూడా పాలమూరులో నిర్వహించిన మాదిగల సమావేశంలో మందకృష్ణ మాలలు మా రిజర్వేషన్లు దొబ్బి తింటున్నారని, వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి తప్పాడని పిచ్చి ప్రేలాపనలు పేలుతుండడం చూస్తుంటే ఈ విషయం అందరికి స్పష్టంగా అర్థమవుతుందన్నారు. మనువాదుల మోచేతి నీళ్లు తాగుతూ మనువాదిగా మారిన మందకృష్ణ తన వైఖరి మార్చుకుని మాల మహానాడుతో కలిసి రావాలని ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాలల మహా సంగ్రామ సభకు మాలలు, మాల ఉపకులాలు లక్షలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి.చిన్న, దాసు, రవికుమార్, రామచంద్రయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై అవగాహన పెంచుకోవాలి



ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: సమగ్ర సర్వేకు సంబంధించి మరో 5 కాలమ్స్ వచ్చాయని వాటిపై అవగాహన పెంచుకోవాలని ఎన్యుమరేటర్లకు జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

❐ మండలంలో సర్వే కోసం ఇంటింటి జాబితా సిద్ధమైనట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలో 15283 ఇళ్లు ఉండగా 106 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరిగి స్టిక్కరింగ్ వేసి 99 శాతం జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 120 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటి జాబితాను సిద్ధం చేసినట్లు కమిషనర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

నవాబుపేట: సామాజిక సర్వేలో భాగంగా ఇంటింటి స్టిక్కరింగ్ పూర్తి కావటంతో ఇక సర్వేపై దృష్టి పెట్టినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లుకు సర్వేపై శిక్షణ ఇచ్చారు. అన్ని వివరాలు పూర్తిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ శంకరాచారి, ఎంఈఓ నాగ్యానాయక్, ఆర్‌ఐ కిరణ్, ఏఓ కృష్ణకిషోర్, బద్రునాయక్ పాల్గొన్నారు.

మూసాపేటలో సదర్ ఉత్సవాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీపావళి అనంతరం యాదవ కులస్తులు ప్రత్యేకమైన ప్రధాన ఉత్సవంగా సదర్‌ను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతులను ఊరేగిస్తూ యువకులు వాటితో కుస్తీ పడుతారు. యాదవ కాలనీ నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన చేశారు. బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన దున్నపోతుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఉత్సవానికి ప్రత్యేక ఆహ్వానితులుగా లడ్డూ యాదవ్, స్వప్న యాదవ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో రత్నయ్య, గోపాల్, శంకర్, నాగరాజు, కుర్మయ్య, వెంకటయ్య, కర్రెన్న, ఎర్రమల్లి, రాములు, రమేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాయం చేయమంటే సొత్తు కాజేశాడు

మహబూబ్‌నగర్ క్రైం: ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని అడిగిన నేపథ్యంలో ఓ వ్యక్తి డబ్బులు డ్రాచేసి అనంతరం ఏటీఎం కార్డు తీసుకుని అతని ఖాతాలో నుంచి డబ్బు మాయం చేశాడు. సీఐ ఇజాజుద్దీన్ వివరాలు.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలానికి చెందిన కేడావత్ రాజు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రాచేసి ఇవ్వాలని గుర్తు తెలియని వ్యక్తిని సహాయం కోరాడు. దీంతో అతను రూ.3వేలు డ్రాచేసి అనంతరం నకిలీ ఏటీఎం కార్డును బాధితుడికి ఇచ్చి ఒరిజినల్ కార్డు తీసుకుని వెళ్లాడు. కాసేపటి తర్వాత బ్యాంక్ ఖాతా నుంచి రూ.37వేలు డ్రాచేసినట్లు ఫోన్‌కు మెసేజ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం వద్ద ఉన్న మలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు భగవద్గీత 12వ అధ్యాయం కంఠస్థ, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతులు పరమానందగిరిస్వామి పోటీలు ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి విద్యార్థి భగవద్గీత పారాయణం చేయాలని, మన సంస్కృతి, సాంప్రదాయాలు, ధర్మ విలువలు, దేశ భక్తిని పెంపొందించుకోవాలన్నారు. విజేతలకు 17న బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా సభ్యులు ఉమ్మెంతల మహేశ్వర్, వెంకటరమణాచార్యులు, కిరణ్, గోనెల రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప సంఘం ఏర్పాటుపై హర్షం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడాన్ని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంత్రి వర్గ ఉప సంఘం త్వరితగతిన సమావేశాలు పెట్టి ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం కోసం ఉద్యోగులు ఎంతగానో ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్.. ఫర్నీచర్ దగ్ధం

మహబూబ్‌నగర్ క్రైం: ఐటీ కన్సల్‌టెంట్ ఆఫీసులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఫర్నీచర్ దగ్ధమైంది. జిల్లా ఫైర్ అధికారి మల్లికార్జున్ కథనం ప్రకారం..పాలమూరు పట్టణంలోని పద్మావతి కాలనీలోని అలైటెడ్ సొల్యూషన్ ఐటీ ఆఫీసులో కార్యాలయంలో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. దీంతో ఆఫీసులోని రెండు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చినట్లు తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే జరిగే అనార్థాలపై జిల్లా కేంద్రంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు అవగాహన కల్పించారు. శుక్రవారం రైల్వే స్టేషన్ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పువ్వులు ఇచ్చి సూచించారు. సేఫ్టీ రూల్స్ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, కోఆర్డినేటర్లు రఘుబాబు, డీన్ మహేష్, ఇన్‌చార్జి పసూన్న పాల్గొన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కొత్వాల్ తదితరులు



జిల్లా కేంద్రంలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

నవాబుపేట: మండల కేంద్రంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజహర్ అలీ, రాజేష్, బాబర్, వెంకటయ్య, నర్సింహ, సత్యం, మనికంఠ, ఆనంద్, సత్యానారయణ, శ్రీనువాస్, నర్సింహులు, తీర్పతయ్య, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ దగ్గర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, గౌస్, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, అశోక్, జహంగీర్, ఉస్మాన్, జహీర్, శివ, హరిగౌడ్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షల మేరకు పాలన..

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ చౌరస్తా సమీపంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన శుభాకాంక్షల కార్డులు కొత్వాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, జహంగీర్‌బాబా, మహ్మద్ యాఖుబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్ మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం అంధుల పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు రవికిరణ్, చందుయాదవ్, రియాజోద్దీన్, వడ్ల రాకేష్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని స్థానిక వివేకానంద చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వై.విద్యాసాగర్, కొండారెడ్డి, బండియాదవ్‌కుమార్, జగన్, నాగరాజు, రాము, ఎల్లన్న, రామస్వామి, శేఖర్, సంపత్, రాజు, మడుగువెంకటయ్య మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. హన్వాడలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్, కలీం, సుధాకర్, శ్రీను, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీయూలో శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు పుట్టపాగ వంశీకుమార్ మాట్లాడుతూ.. యూనివర్సిటీకి లా, ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ఒప్పంద అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. కార్యక్రమంలో భూమయ్య, మాధురిమోహన్, గౌస్ మొయినుద్దీన్, రాంమోహన్, వెంకటేష్, శివ, శిరీష, శ్రీయ, గౌతమి, నందిని తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లపై ధాన్యం రాశులు..!



కొమిరెడ్డిపల్లిలో సర్వీస్ రోడ్డుపై వరి ధాన్యం ఆరబోసిన దృశ్యం

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండటం వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. అడ్డాకుల మండలంలోని శాఖాపూర్, మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి, జానంపేట గ్రామాల్లో సర్వీస్ రోడ్లపై ధాన్యం రాసులు కనబడుతున్నాయి. దీని వల్ల ఆయా గ్రామాల్లోకి సర్వీస్ రోడ్లపై బస్సులు, ఇతర వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా మారింది. ధాన్యం ఆరబోసిన రైతులు పగలు, రాత్రి అక్కడే ఉండటం ప్రమాదంతో కూడుకుంది. రహదారిపై వెళ్లే వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రాణాల మీదకు వస్తుంది. వేములకు వెళ్లే డబుల్ రోడ్డుపై ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద కల్లాల ఏర్పాటుకు నిధులు వస్తున్నా రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదు.

అభివృద్ధి పనులపై కేంద్ర బృందం పరిశీలన



గాధిర్యాల్‌లో పర్యటిస్తున్న కేంద్ర బృందం

మహమ్మదాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రాథమిక స్థాయిలో ప్రజలకు అందుతున్నాయా? గ్రామాల్లో అభివృద్ధి పనులు, పనుల నాణ్యతపై కేంద్ర బృందం పర్యటించింది. శుక్రవారం మండల పరిధిలోని కంచన్‌పల్లి, గాధిర్యాల్ గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టిన సీసీ రోడ్లు, చెరువుల్లో పూడికతీత, ఇంకుడు గుంతల తదితర పనులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృంద అధికారులు ముత్తుకుమార్, దీవన్, ఏపీడీ ముసాహిదాబేగం, శ్రీపాద, ఎంపీడీఓ దేవన్న, ఏపీఓ హర్చింద్రుడు, గ్రామ కార్యదర్శి హాజీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

యువత గాంధీ బాటలో నడవాలి



కళాశాలలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కోయిల్‌కొండ: జాతిపిత మహాత్మా గాంధీ బాటలో యువత నడవాలని రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ అన్నారు. 'బాపుబాటలో' సత్యశోధన పాదయాత్ర శుక్రవారం కోయిల్‌కొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మహాత్మాగాంధీ సిద్ధాంతాలను వివరించారు. 100 రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు పాదయాత్రలో భాగంగా కోయిల్‌కొండలో పర్యటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాము, మాజీ ఎంపీటీసీ బండి యాదవ్‌కుమార్, దిలీప్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

భిన్న రిజర్వేషన్లతో అసమానతలు

మహబూబ్‌నగర్ రూరల్: దేశ వ్యాప్తంగా ఒకే కులవృత్తి చేస్తున్న దోబీలకు భిన్న రిజర్వేషన్లు ఉండటం వలన ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యలో అసమానతలు తలెత్తుతున్నాయని నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక కులస్తులు ఎస్సీ జాబితాలో చేరడం న్యాయమైనదేనని ఎస్సీ సంఘాలతో పాటు ప్రజా సంఘాలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి, జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, శివకుమార్, నాగరాజు, మడేలయ్య, నాగేష్, ఎస్.కేశవులు, అంజనేయులు, యాదయ్య, చందు, నరేష్, రమేష్, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సంస్థాగత ఎన్నికలపై సదస్సు

పాలమూరు: జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం సంస్థాగత ఎన్నికల నిర్వహణపై సదస్సు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ హాజరవుతారని పేర్కొన్నారు. రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యదర్శులు, కన్వీనర్లు ప్రతి ఒక్కరూ తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి ఘనంగా పూజలు

దేవరకద్ర: దేవరకద్ర మండలంలో ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

హన్వాడ: మండల పరిధిలోని గొండ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల ఎంపికలో నందిని(పదోతరగతి), పవిత్ర, రాంచరణ్, నరహరి(9వ తరగతి)లు ఎంపికయ్యారు. ఈ నెల 10న మేడ్చల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థలకు అభినందనలు తెలియజేశారు.

సహస్రార్జున జయంతి వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ భవన్‌లో శుక్రవారం సహస్రార్జున జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ ప్రతినిధులు రాజేంద్ర కటీగర్, చంద్రకాంత్ గణేష్, చిన్నులాల్ గంజి, సూర్యనారాయణరావు నగరి, నరేష్, వసంత్ రావు, సూర్యప్రకాశ్, ప్రవీణ్‌కుమార్, గోవింద్ రావు, గణేష్, మధు జనార్దన్, నాగరాజు, మాణిక్‌ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట వద్ద ఆర్టీసీ బస్‌ను వెనుక నుంచి ట్రావెల్స్ బస్ ఢీకొట్టింది. వనపర్తి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్ మహబూబ్‌నగర్ నుంచి వస్తూ జానంపేట వద్ద ప్రయాణికులను దింపి బస్సు ముందుకు వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్ బస్ ఆర్టీసీ బస్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్‌లో ఉన్న ఒకరిద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.